




# క్రైమ్ THE మిర్రర్ ®

Voice of Anti Corruption

## తెలంగాణ జిల్లాలు

సోమవారం 07-09-2026 | పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్


# కాంట్రాక్టర్ల ధన బలమా? అధికారుల నిర్లక్ష్యమా?




జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని గోదావరి పరివాహక ప్రాంతంలో కొనసాగుతున్న ఇసుక క్వారీల నిర్వహణపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇసుక విక్రయాలు, లోడింగ్, రవాణా ప్రక్రియ కొనసాగాల్సి ఉండగా.. కొన్ని ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా అదనపు వసూళ్లు జరుగుతున్నాయన్న ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి.

క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి

2లో




క్రైమ్ మిర్రర్, పలిమెల ప్రతినిధి

అంగన్వాడీ పోస్టుల భర్తీకి నిర్వహిస్తున్న ఇంటర్వ్యూ విధానంపై అభ్యర్థుల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నత స్థాయి ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల్లో సైతం అనేక చోట్ల రాత పరీక్షలు, మెరిట్, ఇతర నిర్దిష్ట ప్రమాణాల ఆధారంగా ఎంపిక జరుగుతుండగా.. గ్రామీణ స్థాయిలోని అంగన్వాడీ పోస్టులకు మాత్రం ఇంటర్వ్యూలు నిర్వహించడం ఎందుకని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు.

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహాదేవపూర్ అంగన్వాడీ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా అభ్యర్థుల ఇంటర్వ్యూల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. అంగన్వాడీ టీచర్ పోస్టులకు ఇంటర్ అర్హతను నిర్దేశించిన నేపథ్యంలో, అభ్యర్థుల విద్యార్హత మార్కులు, స్థానికత, రిజర్వేషన్ తదితర నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా మెరిట్ ఆధారంగా ఎంపిక చేయాలని పలువురు కోరుతున్నారు.

2లో

- పటాన్‌చెరు పచ్చదనం కోసం పోరుబాట.. నడుం బిగించిన పృథ్వీరాజ్
- "3కే రన్--రన్ ఫర్ నేచర్" కార్యక్రమానికి భారీ స్పందన
- కాలుష్యరహిత పటాన్‌చెరు కోసం మాద్రి పృథ్వీరాజ్ సంకల్పం..
- పొల్యూషన్ ఫ్రీ పటాన్‌చెరు సీజన్-2కు విశేష స్పందన..
- భారీగా పాల్గొన్న యువత, మహిళలు, విద్యార్థులు, ప్రజలు
- అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణ కూడా అవసరం పృథ్వీరాజ్
- మొక్కల పంపిణీ.. పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలని పిలుపు
- ఇది ముగింపు కాదు.. పర్యావరణ ఉద్యమానికి మరో అడుగు

## మాద్రి పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో..

# కాలుష్యంపై పరుగులు

పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 05: పర్యావరణ పరిరక్షణ కొరకు ప్రజల్లో అవగాహన పెంపొందించడంమే లక్ష్యంగా ఎండిఆర్ ఫౌండేషన్ అధినేత మాద్రి పృథ్వీరాజ్ నడుం బిగించారు. మాద్రి పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో "3కె రన్ -- పొల్యూషన్ ఫ్రీ పటాన్‌చెరు సీజన్-2 -- రన్ ఫర్ నేచర్" అనే కార్యమాన్ని ఆదివారం చేపట్టారు. కాలుష్య నియంత్రణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం ఉపయోగ పడుతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జేపి ఫార్మ్స్, ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్ లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై జెండా ఊపి 3కె రన్‌ను ప్రారంభించారు.

మిగతా 6లో



# కాంట్రాక్టర్ల ధన బలమా?
# అధికారుల నిర్లక్ష్యమా?

ఇసుక కోసం క్వారీల వద్దకు చేరుకునే వాహనదారుల నుంచి ప్రభుత్వ నిర్దేశిత ధరలకు అదనంగా లోడింగ్ చార్జీలు, ఇతర పేర్లతో డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. డబ్బులు చెల్లిస్తేనే లోడింగ్ త్వరగా జరుగుతుందని, లేదంటే వాహనాలను గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని కొందరు వాహనదారులు వాపోతున్నట్లు సమాచారం. దీంతో అసలు ప్రభుత్వ ధర ఎంత? అదనంగా వసూలు చేస్తున్న మొత్తం ఎక్కడికి వెళ్తోంది? ఈ వసూళ్లకు అధికారిక అనుమతి ఉందా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

**నిబంధనలు అమలవుతున్నాయా?**

ఇసుక తవ్వకం నుంచి విక్రయం, లోడింగ్, రవాణా వరకు ప్రతి దశలో ప్రభుత్వ నిబంధనలు అమలు కావాల్సి ఉంది. క్వారీల వద్ద ధరల వివరాలు, లోడింగ్‌కు సంబంధించిన నిబంధనలు, రసీదులు స్పష్టంగా అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉంది. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఎలా ఉన్నాయి? నిబంధనలకు విరుద్ధంగా ఏమైనా జరుగుతోందా? అనే అంశంపై సంబంధిత అధికారులు సమగ్రంగా తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు..**

ఇసుక క్వారీల నిర్వహణపై సంబంధిత శాఖల పర్యవేక్షణ ఉన్నప్పటికీ.. అదనపు వసూళ్ల ఆరోపణలు నిజమే అయితే అవి అధికారుల దృష్టికి రాకపోవడం ఎలా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. క్వారీల వద్ద రోజువారీగా జరుగుతున్న లోడింగ్, వాహనాల రాకపోకలు, వసూళ్లు, రసీదుల జారీ తదితర అంశాలపై అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తే వాస్తవ పరిస్థితులు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

**ధన బలమా..? నిర్లక్ష్యమా..?**

ఇసుక వ్యాపారంలో భారీ మొత్తాల లావాదేవీలు జరుగుతుండటంతో కాంట్రాక్టర్ల ఆర్థిక ప్రభావంపై కూడా స్థానికంగా చర్చ జరుగుతోంది. అయితే ఆరోపణల్లో వాస్తవమెంత? కేవలం కాంట్రాక్టర్ల ధనబలంతోనే నిబంధనలకు విరుద్ధమైన వ్యవహారాలు జరుగుతున్నాయా? లేక సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపమే కారణమా? అనేది అధికారుల విచారణతోనే తేలాల్సి ఉంది.

**సమగ్ర విచారణకు డిమాండ్..**

మహాదేవపూర్ మండలంలోని గోదావరి పరివాహక ప్రాంత ఇసుక క్వారీల్లో అధికారిక ధరలు, లోడింగ్ చార్జీలు, వాహనాల నుంచి వసూలు చేస్తున్న మొత్తాలు, జారీ చేస్తున్న రసీదులు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, క్వారీ నిర్వహణ నిబంధనలు తదితర అంశాలపై ఉన్నతాధికారులు సమగ్రంగా పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండిపడకుండా, వాహనదారులపై అదనపు భారం పడకుండా, ఇసుక రవాణా ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఇసుక క్వారీల్లో నిజంగా ఏం జరుగుతోంది..?

**అదనపు వసూళ్ల వెనుక ఎవరి హస్తం ఉంది..?**

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు ఎప్పుడు..? ఈ ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

**- పూసుకపల్లి -1 లో అక్రమాలపై తదుపరి కథనం..**

**నిఘా వ్యవస్థ నిద్రిస్తే క్రైమ్ మిర్రర్ కాపు కాస్తుంది..**

# అంగన్వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు ఎందుకు?

అంగన్వాడీ పోస్టులు సాధారణ స్థాయి ఉద్యోగాలు కావని, చిన్నారుల సంరక్షణ, పోషణ, ప్రీ-స్కూల్ విద్య వంటి బాధ్యతలు నిర్వహించాల్సిన కీలకమైన పోస్టులని అభ్యర్థులు చెబుతున్నారు. అయితే ఎంపిక ప్రక్రియలో ఇంటర్వ్యూకు అవకాశం ఇవ్వడం వల్ల వ్యక్తిగత అభిప్రాయాలకు, అధికారుల నిర్ణయాలకు ఎక్కువ ప్రాధాన్యం లభించే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. “ఇంటర్ మార్కుల ఆధారంగా మెరిట్ జాబితా రూపొందించి ఎంపిక చేయొచ్చు. అలాంటప్పుడు ఇంటర్వ్యూ ఎందుకు?” అని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు.

**ఉన్నత ఉద్యోగాలకు లేని ఇంటర్వ్యూ.. మాకెందుకు?**

ఇంజినీరింగ్, గ్రూప్ ఉద్యోగాలు, ఇతర ఉన్నత స్థాయి పోస్టులకు పోటీ పరీక్షలు, మెరిట్, ర్యాంకింగ్ వంటి పద్ధతులు అమలులో ఉండగా.. అంగన్వాడీ పోస్టులకు మాత్రం ఇంటర్వ్యూ విధానాన్ని కొనసాగించడంపై అభ్యర్థులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. “ఉన్నత స్థాయి ఉద్యోగాలకు ఎంపిక ప్రక్రియను పరీక్షలు, మెరిట్ ఆధారంగా నిర్వహిస్తున్నప్పుడు.. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు పోటీ పడే అంగన్వాడీ పోస్టులకు ప్రత్యేకంగా ఇంటర్వ్యూ పెట్టడం ఎంతవరకు సమంజసం?” అని వారు నిలదీస్తున్నారు. ఇంటర్వ్యూ కారణంగా అభ్యర్థుల మధ్య అనవసరమైన అనుమానాలు ఏర్పడే అవకాశం ఉందని, ఎంపిక ప్రక్రియపై పూర్తిస్థాయి పారదర్శకత ఉండాలంటే ఇంటర్వ్యూ లేకుండా స్పష్టమైన మెరిట్ ప్రమాణాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అంగన్వాడీ నియామక ప్రక్రియపై ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు ప్రకటించి, అభ్యర్థులకు ఎలాంటి సందేహాలు తలెత్తకుండా ఎంపిక ప్రక్రియను నిర్వహించాలని వారు కోరుతున్నారు. ఇటీవల భూపాలపల్లి జిల్లాలో అంగన్వాడీ పోస్టుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా, ప్రభుత్వ నిబంధనల ప్రకారమే నిర్వహిస్తామని జిల్లా సంక్షేమాధికారులు వెల్లడించినట్లు వార్తలు వచ్చాయి. అభ్యర్థుల ప్రధాన డిమాండ్ మాత్రం ఒక్కటే---అంగన్వాడీ పోస్టుల ఎంపికలో ఇంటర్వ్యూ విధానాన్ని వెంటనే తొలగించి, పారదర్శకమైన మెరిట్ ఆధారిత ఎంపిక విధానాన్ని అమలు చేయాలి. ఇంటర్వ్యూ ద్వారా కాకుండా విద్యార్హత మార్కులు, నిబంధనల ప్రకారం నిర్దేశించిన ఇతర అర్హతలను పరిగణనలోకి తీసుకుని ఎంపిక చేస్తే అభ్యర్థులందరికీ సమాన అవకాశం లభిస్తుందని వారు పేర్కొంటున్నారు.

**అభ్యర్థుల డిమాండ్లు..**

అంగన్వాడీ పోస్టుల ఎంపికలో ఇంటర్వ్యూ విధానాన్ని వెంటనే రద్దు చేయాలి.

ఇంటర్ మార్కులకు ప్రాధాన్యం ఇచ్చి మెరిట్ ఆధారంగా ఎంపిక చేయాలి.

ఎంపిక ప్రక్రియకు సంబంధించిన ప్రమాణాలను స్పష్టంగా వెల్లడించాలి.

**అభ్యర్థులందరికీ సమాన అవకాశాలు కల్పించాలి.**

నియామక ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలి.

అభ్యర్థుల ఆందోళనలపై అధికారులు స్పందించి, ఇంటర్వ్యూ విధానం ఎందుకు అవసరమో స్పష్టత ఇవ్వాలని వారు కోరుతున్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం, ఉన్నతాధికారులు పరిగణనలోకి తీసుకుని ఇంటర్వ్యూ విధానాన్ని తొలగించాలని అభ్యర్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## గ్రామాల అభివృద్ధికి తన వంతు కృషి..

కేశంపేట,(క్రైమ్ మిర్రర్): గ్రామాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని సుందరాపురం బోనాల సందర్భంగా గ్రామాన్ని సందర్శించారు. అనంతరం 5 లక్షల తన సొంత నిధులతో గ్రామం నుండి మహాలింగేశ్వర స్వామి ఆలయం వరకు ఏర్పాటు చేసిన మట్టి రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో పేరుగాంచిన మహాలింగేశ్వర స్వామి ఆలయానికి వెళ్లడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు కొన్ని రోజుల క్రితం తెలిపారని గ్రామ ప్రజలను దృష్టిలో ఉంచుకొని తన సొంత నిధులతో రోడ్డును పనులను మరమత్తు చేయించారన్నారు. నన్ను నమ్మి,నాతో నడుస్తున్న నాయకులకు ప్రజలందరికీ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు,పల్లెల అభివృద్ధికి నా వంతు కృషి నిరంతరం కొనసాగుతుందని అన్నారు.గ్రామ ప్రజలు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డికి ఘనస్వాగతం పలికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సుందరాపూర్ సర్పంచ్ భారతి రవీందర్,కేశంపేట సర్పంచ్ బొజ్జం సంతోష శ్రీశైలం,పోమాల్ పల్లి సర్పంచ్ స్వప్న భూపాల్ రెడ్డి, మాజీ సర్పంచులు యారం శేఖర్ రెడ్డి,శేఖర్ పంతులు,ఆంజనేయులు యాదవ్, జంగయ్య,మాజీ ఎంపిటిసి కోటేశ్వర్, ఉపసర్పంచులు యారం రామ్ రెడ్డి,నరేందర్ రెడ్డి,మాజీ ఉపసర్పంచ్ మన్మధ రెడ్డి,నాయకులు పల్లటి క్రిష్ణయ్య,వేములనర్స మల్లేష్,శివ యాదవ్,మురళి, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు..

## ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా సంతోష్ గుప్తా.

కేశంపేట (క్రైమ్ మిర్రర్): ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులుగా మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన వీరమల్ల సంతోష్ కుమార్ గుప్త ఎంపికయ్యారు. ఆదివారం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు.ప్రధాన కార్యదర్శిగా పాలాది శ్రీనివాస్ గుప్త,కోశాధికారిగా ఇరువేంటి రాఘవేంద్ర గుప్త, ఉపాధ్యక్షులుగా పి.నాంపల్లి సంతోష్ గుప్త,గంప రాజేష్ గుప్త,కార్యదర్శులు చందా అనిల్ గుప్త, సోషల్ మీడియా కన్వీనర్, కందే ఆంజనేయులు గుప్తలతో పాటు 8 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ మండల ఆర్యవైశ్య సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలను అప్పగించినందుకు ఆర్యవైశ్య నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు గంప శ్రీనివాస్ గుప్త, కుమారస్వామి, గోవిందు గోపాల్, గోవిందు చంద్రయ్య, కొత్తపేట అశోక్ గుప్తా, పాలది వెంకటేష్, నరసింహులు, రాజు, సంతోష్ పాల్గొన్నారు.





## ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

**పోచమ్మ బోనాల ఉత్సవాలకు రూ.54,116 విరాళం అందజేసిన మాజీ సర్పంచ్ ఎల్ ఎన్ రెడ్డి**

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (కడ్తాల్):** ఆధ్యాత్మిక చింతనను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని, తద్వారా మానసిక ప్రశాంతతతో పాటు సమాజంలో సానుకూల వాతావరణం ఏర్పడుతుందని కడ్తాల్ మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి అన్నారు. ఆదివారం గ్రామదేవత పోచమ్మ దేవాలయంలో బోనాల ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించనున్న బోనాల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించాలని కమిటీ సభ్యులను కోరారు. బోనాల ఉత్సవాల నిర్వహణకు తన వంతు సహకారంగా పోచమ్మ దేవాలయ ఉత్సవ కమిటీకి రూ.54,116 విరాళాన్ని అందజేశారు. దేవాలయాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన వంటి కార్యక్రమాలకు రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామంలో నాలుగు రోజులపాటు నిర్వహించనున్న బోనాల ఉత్సవాలను విజయవంతం చేసేందుకు గ్రామస్తులు, భక్తులు, యువత, ప్రజాప్రతినిధులు సమష్టిగా సహకరించాలని కోరారు. గ్రామదేవత ఆశీస్సులతో బోనాల ఉత్సవాలు ప్రశాంతంగా, వైభవంగా జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్ సత్యం యాదవ్, సింగిల్ విండో చైర్మన్ గంపా వెంకటేష్ గుప్తా, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కంబాల పరమేష్, వార్డు సభ్యులు మాధారం గణేష్ గౌడ్, కమిటీ సభ్యులు చేగూరి రాములు గౌడ్, గూడూరు శేఖర్ రెడ్డి, మాలె మల్లేష్ గౌడ్, వాంకుడావత్ రాంచందర్ నాయక్, గురిగళ్ల రామచంద్రయ్య, మూడ అశోక్, అమృతం పాండు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## పోకల దేవదాసు పరామర్శించిన ఎమ్మెల్యే వేముల



**చిట్యాల క్రైమ్ మిర్రర్:** నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పోకల దేవదాసు స్వల్ప అనారోగ్యంతో బాధపడుతూ చిట్యాల ఉన్న తన ఇంటికి వచ్చి విశ్రాంతి తీసుకుటుండంగా వారిని పరామర్శించి, ప్రస్తుత ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్న ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

## బోనమెత్తిన మహిళలు

**అధిక సంఖ్యలో పాల్గొన్న మహిళలు, ముత్యాలమ్మ గూడెం 9వ వార్డులో ఘనంగా బోనాల పండుగ వేడుకలు**





**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మున్సిపల్ పరిధిలో ముత్యాలమ్మ బోనాలు ఘనంగా జరిగాయి భక్తులు మధ్య అంగరంగ వైభవంగా ముత్యాలమ్మ బోనాలు మరియు కోడిపుంజులను అమ్మవారికి సమర్పించి కన్నుల పండగ అమ్మవారికి బోనాలను సమర్పించారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మ వారి కృప కరుణ కటాక్షానికి భక్తు అందరికీ అమ్మవారి దీవెనలు ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు

# శ్రీధర్ బాబుపై బీఆర్ఎస్ కుట్ర ప్రచారం..!!

- **శ్రీధర్ బాబుపై దుష్ప్రచారం.. ప్రజలు నమ్మరు**
- **దుష్ప్రచారం కాదు.. అభివృద్ధిని చూడండి**
- **శ్రీధర్ బాబు చేస్తున్న అభివృద్ధి, సేవలను ప్రజలు ప్రత్యక్షంగా చూస్తున్నారు: కాంగ్రెస్ యువత**



**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాన్ని ప్రజలు నమ్మరని సూరారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు దాసరి సాగర్ పటేల్ అన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేకే మంత్రి శ్రీధర్ బాబుపై దుష్ప్రచారం చేస్తూ ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1,000 రోజుల పాలనపై బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలకు స్పందించిన సాగర్ పటేల్.. మంత్రిగా శ్రీధర్ బాబు నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, విద్య, వైద్యం, మౌలిక వసతులు, ప్రజా సంక్షేమానికి సంబంధించిన అంశాలపై ప్రభుత్వం దృష్టి సారిస్తోందని పేర్కొన్నారు. ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం కోసం కృషి చేస్తున్న నాయకుడిపై "సాయం చేయడం లేదు.. పట్టించుకోవడం లేదు" అంటూ బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ప్రచారం వాస్తవాలకు పూర్తి విరుద్ధంగా ఉందని సాగర్ పటేల్ అన్నారు. "శ్రీధర్ బాబు ప్రజలకు సాయం చేయడం లేదని ప్రచారం చేస్తున్న వారు.. గతంలో ప్రజల కోసం ఏం చేశారో ముందుగా చెప్పాలి. మంత్రి అందుబాటులో లేరని, ప్రజలను పట్టించుకోవడం లేదని తప్పుడు ప్రచారం చేయడం సరికాదు. ప్రజలకు వాస్తవాలు తెలుసు. ఎవరు ప్రజల మధ్య ఉంటున్నారు.. ఎవరు కేవలం రాజకీయాల కోసం మాట్లాడుతున్నారో ప్రజలే గమనిస్తున్నారు" అని ఆయన అన్నారు. బీఆర్ఎస్ నాయకులు ప్రతిరోజూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, మంత్రి శ్రీధర్ బాబును లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేయడం వెనుక రాజకీయ ఉద్దేశం తప్ప మరొకటి లేదని ఆరోపించారు. శ్రీధర్ బాబుకు నియోజకవర్గంలో లభిస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకే ఇలాంటి ప్రచారాలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

అభివృద్ధి పనులు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై చర్చించకుండా వ్యక్తిగతంగా మంత్రిని టార్గెట్ చేయడం బీఆర్ఎస్ నాయకుల రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని అన్నారు. విమర్శలు చేయాలంటే ఆధారాలతో మాట్లాడాలని, లేకపోతే ప్రజల్లో బీఆర్ఎస్ నాయకులే చులకన అవుతారని హెచ్చరించారు. "మంత్రి శ్రీధర్ బాబును అడ్డుకోవడానికి ఎన్ని రకాల దుష్ప్రచారాలు చేసినా ప్రజలు నమ్మరు. ఆయన చేస్తున్న అభివృద్ధి పనులు, ప్రజలకు అందిస్తున్న సేవలే ఆయనకు సమాధానం. మంథని నియోజకవర్గ ప్రజలకు ఎవరు అండగా నిలుస్తున్నారో అందరికీ తెలుసు" అని దాసరి సాగర్ పటేల్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ యువతగా తాము గ్రామాల్లో ప్రజలతో మమేకమై ఉంటామని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు. ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయ ప్రచారాన్ని తిప్పికొడుతూ వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకెళ్తామని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకులు ఇకనైనా వ్యక్తిగత విమర్శలు, దుష్ప్రచారాలు మానుకుని ప్రజా సమస్యలపై నిర్మాణాత్మకంగా మాట్లాడాలని దాసరి సాగర్ పటేల్ సూచించారు. రాబోయే రోజుల్లో కూడా మంత్రి శ్రీధర్ బాబు నాయకత్వంలో నియోజకవర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్ శ్రేణులు ఐక్యంగా పనిచేస్తాయని ఆయన తెలిపారు.

# కడ్తాల్‌లో కొత్త వ్యాపార సంస్థలకు శ్రీకారం

**సీసీ కెమెరాలు--సౌర విద్యుత్ సేవల కేంద్రం, ఫ్యామిలీ రెస్టారెంట్‌ను ప్రారంభించిన జర్పుల దశరథ్ నాయక్**



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (కడ్తాల్):** రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రంలో ఆదివారం నూతన వ్యాపార సంస్థలు ప్రారంభమయ్యాయి. కడ్తాల్ మాజీ జెడ్పీటీసీ, రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు జర్పుల దశరథ్ నాయక్ స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, వ్యాపార ప్రముఖులతో కలిసి నూతన సంస్థలను ఘనంగా ప్రారంభించారు. కడ్తాల్ మండల కేంద్రంలోని గాంధీ ప్లాజాలో, దక్షిణ భారత ఫిల్టర్ కాఫీ పక్కన ప్రముఖ యువ వ్యాపారవేత్త రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్‌పీఎం సీసీటీవీ భద్రతా పరిష్కారాలు మరియు సౌర విద్యుత్ ప్రాజెక్టుల కేంద్రాన్ని జర్పుల దశరథ్ నాయక్ రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో సీసీ కెమెరాలు, భద్రతా పరికరాలు, సౌర విద్యుత్ ప్రాజెక్టులకు సంబంధించిన సేవలు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు..ప్రారంభోత్సవం అనంతరం రమేష్, ఆయన ధర్మపత్నిని జర్పుల దశరథ్ నాయక్‌తో పాటు స్థానిక ప్రముఖులు, వ్యాపారవేత్తలు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. నూతన వ్యాపార రంగంలో అడుగుపెట్టిన రమేష్ దంపతులు విజయవంతంగా రాణించాలని ఆకాంక్షిస్తూ పలువురు శుభాకాంక్షలు తెలిపారు..ఈ సందర్భంగా జర్పుల దశరథ్ నాయక్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ప్రతి ఇల్లు, దుకాణం, వ్యాపార సంస్థకు సీసీ కెమెరాల భద్రత ఎంతో అవసరమని పేర్కొన్నారు. పెరుగుతున్న విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించడంతో పాటు కాలుష్య రహిత సమాజ నిర్మాణానికి సౌర విద్యుత్ ప్రాజెక్టులు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. కడ్తాల్ ప్రజలకు ఆధునిక, నాణ్యమైన భద్రతా సేవలను అందుబాటులోకి తీసుకొచ్చిన రమేష్ ప్రయత్నాన్ని ఆయన అభినందించారు. అనంతరం గోవిందపల్లిలోని రతన్ జై రామ్ శివ కుటుంబ రెస్టారెంట్‌ను కూడా జర్పుల దశరథ్ నాయక్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందించేందుకు ఆధునిక రెస్టారెంట్లు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. స్థానికులకు మెరుగైన సేవలు అందిస్తూ రెస్టారెంట్ మంచి గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో మండల పరిధిలోని ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, స్థానిక వ్యాపార ప్రముఖులు, రమేష్ స్నేహితులు, బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రేమ జవహర్‌లాల్ నాయక్, మాజీ సర్పంచ్ తులసీరామ్ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, ఉప సర్పంచ్ హిరాసింగ్ నాయక్, నాయకులు బాబా, చందన్, శంకర్, శివ, జగన్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల సమగ్ర ప్రగతి కోసం ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలి...

### గిరిజన సర్పంచ్ ఫోరం రాష్ట్ర కమిటీ ....

**దేవరకొండ టౌన్ సెప్టెంబర్ 06 క్రైమ్ మిర్రర్ ప్రతినిధి:** నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గం లో ఆదివారం రోజు గిరిజన సర్పంచ్ ఫోరం సదస్సు ను ఏర్పాటు చేశారు, ఈ కార్యక్రమం లో ముఖ్య అతిధిగా భూక్య సంతోష్ నాయక్ తెలంగాణ గిరిజన సర్పంచ్ ఫోరం వేవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు మరియు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాంసింగ్ నాయక్ పాల్గొన్నారు, వారు మాట్లాడుతూ,గిరిజన తండాలు, గూడాల సమగ్ర ప్రగతి కోసం ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేసి, దానికి ఐదు వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని, పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం గిరిజన సర్పంచ్‌లకు పూర్తి అధికారాలు, పరిపాలనా స్వేచ్ఛను కల్పించాలని తెలంగాణ రాష్ట్ర గిరిజన సర్పంచ్ ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం, దేవరకొండ టిటిడి కల్యాణ మండపంలో ఇట్టి కార్యక్రమాన్ని నిర్వహించారు,గిరిజన తండాలను రెవెన్యూ గ్రామ పంచాయతీలుగా గుర్తించాలని.. ఉండాలన్నారు. సర్పంచ్ నెలవారి వేతనం కనీసం 30 వేల రూపాయలకు పెంచాలి.. విధుల్లో మరణించిన సర్పంచ్ కు 50 లక్షల రూపాయలు కేటాయించాలని. ప్రతి తండా గ్రామపంచాయితీలో డిజిటల్ లైబ్రరీని ఏర్పాటు చేయడంతో పాటు, గిరిజనులకు సబ్సిడీ నిధులు విడుదల చేసి, తండాల్లో ఇందిరమ్మ ఇల్లుని ప్రత్యేకంగా కేటాయించాలన్నారు. ప్రతి తండా గ్రామపంచాయితీకి ప్రైమరీ హాస్పిటల్ ఏర్పాటు చేయాలి. జీవో నెంబర్.3ని పునరుద్ధరించాలి. తండాల్లో పాఠశాలను ప్రైవేట్ మాదిరిగా అభివృద్ధి చేసి నాణ్యమైన విద్యను అందించాలని ఆయన కోరారు. అలాగే పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు పెంచాలి. గిరిజన పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి. గిరిజనులకు క్యాబినేట్ లో స్థానం కల్పించాలి. ఐటీడీఏ గిరిజన గ్రామాల్లో ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలి. ప్రతి గిరిజన గ్రామాల్లో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. తండాల అభివృద్ధికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేసి ఐదు వేల రుపాయలు నిధులు కేటాయించి సర్పంచులకు భరోసా కల్పించాలని ఆయన కోరారు. తండాల జనాభా ప్రాతిపదికన నేరుగా గ్రామ పంచాయతీలకే బడ్జెట్ నిధులు విడుదల చేయాలి. రాజ్యాంగబద్ధమైన హక్కుల ప్రకారం గిరిజన తండాలలో స్వయంపాలనను మరింత బలోపేతం చేయాలన్నారు. గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల (రోడ్లు, తాగునీరు, విద్యుత్) కల్పన కోసం కృషి చేయాల్సిన అవసరాన్ని ఆయన గుర్తుచేశారు. నిధుల కొరతతో ఇబ్బంది పడుతున్న సర్పంచ్‌లకు అండగా నిలవడానికి ఒక ఉమ్మడి వేదికను బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. గిరిజన తండాలు , గూడాలలో రోడ్లు,



తాగునీరు, విద్యుత్ వంటి కనీస వసతులు లేక గిరిజనులు పడుతున్న ఇబ్బందులపై ఫోరం తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ప్రస్తుతం నిధుల కొరత కారణంగా గ్రామాల్లో పారిశుధ్యం, వీధి దీపాలు, తాగునీటి సరఫరా వంటి కనీస పనులను కూడా కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లు చేయలేకపోతున్నారని.. ఈ ఆర్థిక ఇబ్బందుల నుండి సర్పంచ్‌లను ఆదుకోవడానికి ఫోరం వ్యూహాలు రచిస్తోందన్నారు. సర్పంచ్‌ల అధికారాలను అధికారులు కానీ, స్థానిక రాజకీయ నాయకులు కానీ తొక్కేయాలని చూస్తే వారికి న్యాయపరమైన అండగా నిలవడానికి ఫోరం తరఫున ఒక 'లీగల్ సెల్' ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. గ్రామ పంచాయతీలకు నేరుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి వచ్చే నిధులు (రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు) సకాలంలో విడుదలయ్యేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం మా లక్ష్యమని అన్నారు. పెరుగుతున్న ఖర్చులకు అనుగుణంగా సర్పంచ్‌ల గౌరవ వేతనాన్ని పెంచాలని, వారికి సామాజిక భద్రత కల్పించాలని ఉమ్మడి వేదిక ద్వారా డిమాండ్ చేస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వేలాది గిరిజన సర్పంచ్‌లను ఒకే నెట్‌వర్క్ లోకి తీసుకువచ్చి, ఏ ఒక్క సర్పంచ్‌కు సమస్య వచ్చినా అందరూ కలిసికట్టుగా స్పందించే వ్యవస్థను నిర్మించడం జరుగుతుందన్నారు. తండాల అభివృద్ధి మనచేతుల్లోనే ఉంది. రాజ్యాంగపరమైన అధికారాలు, బడ్జెట్ సాధనకై మన పోరాటం జరుగుతుందని, సమస్యల పరిష్కారం కోసం మనమంతా ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది అన్ని కొనియాడారు, అనంతరం జిల్లా, మండల కమిటీని ఎన్నుకోవడం జరిగింది, ఈకార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లైలా పరమేష్. కుతాటి సంధ్య.సర్పంచులు భీముడు. శ్రీను.లక్ష్మణ్. కిషన్.శంకర్. కవిత లచ్చిరామ్.సైదులు.రమేష్. జ్యోతి పాండు. తదితరులు పాల్గొన్నారు..

# భక్తిశ్రద్ధలతో బోనాలు.. కడ్తాలలో పండుగ శోభ



అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు.. భారీగా తరలివచ్చిన భక్తులు

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (కడ్తాల్):** కడ్తాల్ పట్టణంలో బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయని కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీ నరసింహా రెడ్డి తెలిపారు. ఆదివారం రోజున అపర్ణ పెద్దమ్మ, ఈదమ్మ మాందాత, బీరప్ప కామరాతి దేవాలయాల్లో స్థానిక నేతలు మరియు గ్రామ పెద్దలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ఉదయం నుండి దేవాలయాలలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించినట్లు చెప్పారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. బోనాల ఉత్సవాల సందర్భంగా భక్తుల కోలాహలంతో ఆలయ పరిసరాలు పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయని అన్నారు. ఈ సందర్భంగా గూడూరు లక్ష్మీనరసింహారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. తరతరాలుగా వస్తున్న ఆచార సంప్రదాయాలను కాపాడుకుంటూ భక్తిశ్రద్ధలతో పండుగను నిర్వహించడం అభినందనీయమన్నారు. అమ్మవారి ఆశీస్సులతో కడ్తాల్ ప్రాంత ప్రజలు సుఖసంతోషాలతో, పాడిపంటలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కంబాల పరమేష్, మాజీ ఎంపీటీసీ సభ్యులు గూడూరు శ్రీనివాస్ రెడ్డి, అన్మాసపల్లి ఉపసర్పంచ్ మహేష్ యాదవ్, వార్డు సభ్యులు మాదారం గణేష్ గౌడ్, ఎర్రోళ్ల రాఘవేందర్, దేవలా నాయక్, యాట నర్సింహా, సింగిల్ విండో డైరెక్టర్ చేగూరి వెంకటేష్, బీచ్యా నాయక్, బాలరాజు, కుల పెద్దలు మూడ బాలయ్య, కేశని యాదయ్య, బొల్లా సత్యనారాయణ, చెన్నమోని శేఖర్, కటికపల్లి రమేష్, రేపని యాదయ్య, వరకుప్పల వెంకటేష్, బోసు వెంకటేష్, సత్యం, నరసింహ, పాండు, రాజు, శ్రీశైలం, మహేష్, కుర్మ సంఘం కుల పెద్దలు యాదయ్య, కృష్ణయ్య, చేగూరి రాములు, సూద శ్రీను, బండ శ్రీను, జల్కమ్ నాగార్జున, జల్కమ్ రమేష్, పిప్పల్ల యాదయ్య, వివిధ కుల సంఘాల పెద్దలు, స్థానిక నాయకులు, భక్తులు, మహిళలు, యువత తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 8న ఉచిత గుండె పరీక్షలు, మెగా రక్తదాన శిబిరం

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 8న కల్వకుర్తిలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షులు లయన్ ఎంగలి బాలకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. లయన్ డా. దామోదర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మెడికవర్ హాస్పిటల్స్ సహకారంతో ఉచిత గుండె పరీక్షల శిబిరాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కల్వకుర్తిలోని ప్రశాంత్ క్లినిక్‌లో నిర్వహించే ఈ ఉచిత గుండె పరీక్షల శిబిరంలో ప్రజలకు గుండె ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన వారికి వైద్యుల సూచనలు, సలహాలు అందించనున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని క్యాంపు చైర్మన్ పసుల వెంకట్ రెడ్డి, కో-చైర్మన్ లయన్ సంపత్ కుమార్ కోరారు. అదేవిధంగా కల్వకుర్తిలోని లయన్స్ భవన్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు క్యాంప్ చైర్మన్ లయన్ బావండ్ల వెంకటేష్ తెలిపారు. రక్తదానం చేయడానికి యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. రక్తదాన శిబిరానికి చైర్మన్‌గా లయన్ బావండ్ల వెంకటేష్, క్యాంప్ కో-చైర్మన్‌గా లయన్ బండెల రామచంద్ర రెడ్డి వ్యవహరించనున్నారు. క్యాంప్ కోఆర్డినేటర్లుగా లయన్ చంద్రకాంత్ రెడ్డి, లయన్ వెంకటస్వామి, లయన్ బావండ్ల మధు సేవలు అందించనున్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ అధ్యక్షులు లయన్ ఎంగలి బాలకృష్ణ, కార్యదర్శి లయన్ గంగుల శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి లయన్ గంప శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమాలు కొనసాగనున్నాయి. ప్రజల ఆరోగ్యం, అత్యవసర సమయాల్లో రక్తం అందుబాటులో ఉండేలా చూడడం వంటి సామాజిక సేవా లక్ష్యాలతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ పి.ఆర్.ఓ. పాషా విజ్ఞప్తి చేశారు.

## ఆపదలో అండగా.. సీఎంఆర్ఎఫ్‌తో భరోసా

### రూ.23,500 సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేసిన గోలి శ్రీనివాస్ రెడ్డి

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి** తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి రూ.23,500 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును హైదరాబాద్లోని తన నివాసంలో ఆదివారం వార్డు సభ్యుడు ఆనంద్‌కు అందజేశారు. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని గోలి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. ఆపదలో ఉన్న పేద, సామాన్య కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలవడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందేలా తన వంతు కృషి చేస్తానని గోలి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, బీఆర్ఎస్ నాయకులు సతీష్, కృష్ణ, భారత్ తదితరులు పాల్గొన్నారు.



## మాదాపూర్ లో డీసీఎం బీభత్సం...

**10 వాహనాలు ఢీ...**

**7 మందికి గాయాలు....**



**క్రైమ్ మిర్రర్ మాదాపూర్:** పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. తేదీ 05.09.2026న రాత్రి సుమారు 10:30 గంటలకు ఇనార్బిట్ మాల్ రోడ్, క్యాపిటల్ ల్యాండ్ గేట్ నెం.03 సమీపంలో **TS34TB2353** నంబర్ గల డీసీఎం వాహనాన్ని అనిల్ కుమార్ అరోల్లా అనే వ్యక్తి ర్యాష్ గా, నిర్లక్ష్యంగా నడుపుతూ ముందు వెళ్తున్న యాక్టివా ద్విచక్ర వాహనంతో సహా పలు వాహనాలను ఢీకొట్టాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ ప్రమాదంలో మొత్తం 10 వాహనాలు దెబ్బతిన్నాయి, 7 మంది వ్యక్తులకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా, ప్రస్తుతం ఎవరి పరిస్థితి ప్రాణాపాయంగా లేదని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు మాదాపూర్ పోలీసులు Cr.No.1356/2026, U/s 125(a) & 281 దీఛీా కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 18 అడుగుల ఎత్తుతో బాలాపూర్ గణేష్ ప్రతిమ

**500 మంది పోలీసులతో భద్రత ఏర్పాట్లు**



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** దేశంలోని ప్రసిద్ధ గణేష్ ఉత్సవాలలో బాలాపూర్ గణనాథుడిది ప్రత్యేక స్థానమే కాకుండా ప్రతి ఏటా గణనాథుడు లడ్డు లక్షల్లో పలకడమే కాకుండా అందుకు తగ్గట్టుగానే గణేష్ ఉత్సవ సమితి సభ్యులు ఏటేటా వివిధ ప్రసిద్ధ ఆలయాల నమూనా అలంకారాలతో గణేష్ మండప నిర్మాణం చేపడుతున్నారు. అందులో భాగంగానే ఈ యేడు బాలాపూర్ గణేశుడి ఆలయ మండప నిర్మాణం పూరి జగన్నాథ ఆలయ నమూనాలో దిల్సుఖ్నగర్కు చెందిన సుధాకర్ రెడ్డి అనే వ్యక్తి డెకరేట్ చేయడం, గణనాధుడి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా గణేష్ చౌక్ నుండి ఇన్ మరియు అవుట్లతో రెండు ప్రత్యేక లైన్లతో దర్శనానికి మరియు దర్శనానంతరం వెళ్లే భక్తులకు వేరు వేరు క్యూ లైన్ ఏర్పాట్లతో పాటు చిన్న పిల్లలకు, దివ్యాంగులకు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు, 8 ఎకరాల స్థలంలో వాహన పార్కింగ్, 100 సిసి కెమెరాలతో పాటు 500 మంది పోలీసు బలగంతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లతో దర్శనానికి విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక సౌకర్యాలు చేయనున్నట్లు బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షులు కళ్లెం నిరంజన్ రెడ్డి తెలిపారు.

# హామీల అమలులో కాంగ్రెస్ సర్కార్ విఫలం: బీఆర్ఎస్

**పంజుగులలో 'బాకీ కార్డు'లతో భారీ నిరసన ర్యాలీ**



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** కల్వకుర్తి మండలం పంజుగుల గ్రామంలో రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు భారీ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయినా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు..ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేయాల్సిన హామీలను గుర్తుచేస్తూ 'బాకీ కార్డు'లను అందజేశారు. అనంతరం ఇంటింటికీ డోర్ స్టిక్కర్లు ఏర్పాటు చేస్తూ, గ్రామంలోని అన్ని వీధుల మీదుగా డీజే, బ్యాండ్, తప్పెట్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు ర్యాలీలో పాల్గొని ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేసి, అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించాలని డిమాండ్ చేశారు. ఉప్పల వెంకటేష్ పిలుపుతో గ్రామంలో బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో కదిలి రావడంతో కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. గ్రామంలోని ప్రధాన వీధుల్లో నిర్వహించిన ర్యాలీ సందర్భంగా బీఆర్ఎస్ కార్యకర్తలు నినాదాలు చేస్తూ ప్రభుత్వంపై తమ నిరసనను వ్యక్తం చేశారు.ంఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు, గ్రామ ప్రజలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శిల్పారామంలో కూచిపూడి నృత్య ప్రదర్శన....



**క్రైమ్ మిర్రర్ మాదాపూర్:** శిల్పారామం, మాదాపూర్ లో ఆదివారం ఎస్.ఎల్.బి కూచిపూడి కళానిలయం ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన ఘనంగా జరిగింది.డాక్టర్ వినీల రావు విధుశెట్టి గారి శిష్య బృందం ఈ ప్రదర్శనలో పాల్గొని ఆహుతులను మంత్రముగ్ధులను చేశారు. కళాకారులు గజవదన, ఒక పరి కొక పరి, వెడలేరా వయ్యారాలు, కామాక్షి స్తుతి, రాజరాజేశ్వరి, నారాయణీయం, స్వాగతం కృష్ణ, అతి నిరుపమా తదితర అంశాలను ప్రదర్శించి మెప్పించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు ప్రణుతి, సుజిత్ర, సిరిచందన, శిరీష, వర్షిణి, సంధ్య, వైష్ణవి రెడ్డి, గౌతమి, లోహిత, వందన, మనస్విని, సాహితి, నిత్య తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హైకోర్టు లాయర్ నేరెళ్ల మాల్యాద్రి, గిడుగు రామమూర్తి పంతులు ఫౌండేషన్ అధ్యక్షురాలు శ్రీమతి గిడుగు కాంతి కృష్ణ విచ్చేసి కళాకారులను అభినందించారు.

# సుబ్రహ్మణ్య స్వామి విగ్రహ ప్రతిష్ఠకు భూమి పూజ



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** అల్మాస్గూడ గ్రామంలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో సుబ్రహ్మణ్య స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి శ్రీకారం చుడుతూ భూమి పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించడం జరిగింది. దేవస్థానం చైర్మన్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో, అర్చకుల వేదమంత్రోచ్చారణలు, ప్రత్యేక పూజల మధ్య ఈ పవిత్రమైన భూమి పూజా కార్యక్రమం ఘనంగా జరిగింది. సుబ్రహ్మణ్య స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ కోసం చేపడుతున్న ఈ కార్యక్రమం దేవస్థాన అభివృద్ధిలో మరో ముఖ్యమైన ముందడుగు. స్వామివారి అనుగ్రహంతో ఆలయానికి వచ్చే భక్తులకు మరింత ఆధ్యాత్మిక వాతావరణం కల్పించడంతో పాటు, భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా దేవస్థానాన్ని మరింత అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందని,భక్తులందరి సహకారం, స్వామివారి కృపతో సుబ్రహ్మణ్య స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం కూడా విజయవంతంగా నిర్వహించబడాలని ఆకాంక్షిస్తూ, ఈ పవిత్ర కార్యంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ ఆలయ కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు.

# సైబరాబాద్ లో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్...



**క్రైమ్ మిర్రర్ సైబరాబాద్ :** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ లో భాగంగా ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారని ట్రాఫిక్ ఏడీసీపీ (అడ్మిన్) జి. నరేందర్ తెలిపారు.ఈ డ్రైవ్ లో భాగంగా 329 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు. వీరిలో 270 ద్విచక్ర వాహనదారులు, 18 ఆటో డ్రైవర్లు, 41 కార్ల డ్రైవర్లు ఉన్నారు. బ్లడ్ ఆల్కహాల్ కాన్సంట్రేషన్ ఆధారంగా వర్గీకరిస్తే 184 మంది 36 ఎంజీ /100 ఎం ఎల్ నుంచి 200 ఎంజీ/100 ఎం ఎల్ మధ్య, 98 మంది 201ఎంజీ /100 ఎం ఎల్ నుంచి 300 ఎంజీ/100 ఎం ఎల్ మధ్య, 47 మంది 301ఎంజీ /100 ఎంఎల్ నుంచి 550 ఎం జీ /100 ఎంఎల్ మధ్య ఆల్కహాల్ సేవించి పట్టుబడ్డారు. వీరందరినీ చట్టపరంగా కోర్టులో హాజరుపరచనున్నట్లు అధికారులు తెలిపారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు పునరుద్ఘాటించారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే భారతీయ న్యాయ సంహిత -2023లోని సెక్షన్ 105 (కల్పబుల్ హోమిసైడ్ నాట్ అమౌంటింగ్ టు మర్డర్) కింద కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ నేరానికి గరిష్టంగా 10 ఏళ్ల జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉంది.గత వారం (31.08.2026 నుంచి 05.09.2026 వరకు) 213 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను కోర్టులు పరిష్కరించాయని, అందులో 15 మందికి జరిమానా, జైలు శిక్ష, ఒకరికి జరిమానా, సోషల్ సర్వీస్, 197 మందికి జరిమానా విధించబడిందని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

# హామీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం




**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** జిహెచ్ఎంసి 60వ డివిజన్ మీర్ పేట్ పాశ్ కాలని వీకర్ సెక్షన్ లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మరియు సబిత ఇంద్రా రెడ్డి ఆదేశాల మేరకు, స్థానిక మాజీ కార్పొరేటర్ ఏనుగుల అనిల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం పైన నిర్వహించిన నిరసన కార్యక్రమంలో తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజుల్లో 6 గ్యారంటీలు, 420 హామీలను అమలు చేస్తామని ప్రకటించి, 1000 రోజులు గడిచినా వాటిని నెరవేర్చక ప్రజలను మోసం చేసినందుకు నిరసనగా 6 గ్యారంటీల వైఫల్యాల బాకీ కార్డుల పంపిణీ మరియు 420 హామీల ఫ్లెక్సీప్రదర్శన నిర్వహించడం జరిగింది. పార్టీ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసి అధికారం చేపట్టిందని దుయ్యబట్టారు. ఇదే విధంగా పాలన కొనసాగితే తప్పక ప్రజలు కాంగ్రేస్ పార్టీ రాజకీయ నాయకులకు రాజకీయ సన్యాసం ఇస్తారని, భవిష్యత్తులో సబితా ఇంద్రా రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఆరచకాపైన నిరసన ధర్నా కార్యక్రమాలు చేపడతామని , అనంతరం పాశ్ కాలనీ వీకర్ సెక్షన్ ప్రజలకు, మైనార్టీలకు, మహిళలకు కాంగ్రెస్ బాకీ కార్డులు పంచారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులుగా సూరపల్లి గణేష్ నేత

**క్రైమ్ మిర్రర్,సంస్థాన్ నారాయణపురం:** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రం పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులుగా సురపల్లి గణేష్ నేత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశాలి యువజన సంఘం అభివృద్ధికై నిరంతరం కృషి చేస్తానని యువజన సంఘం ఆధ్వర్యంలో చేనేత కార్మికులకు పద్మశాలి కుల బాంధవులకు ఆయన శక్తివంతున కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి రాజకీయ విభాగం అధ్యక్షులు,మాజీ జెడ్పిటిసి బొల్లా శివశంకర్,బిజెపి నాయకులు వంగర రఘు,చేనేత సహకార సంఘం డైరెక్టర్ దువ్వ విజయలక్ష్మి అంజయ్య,వార్డ్ నెంబర్ సురపల్లి వెంకటేష్ నేత,లాయర్ గర్దాస్ రాఘవేంద్ర,సురపల్లి జోహార్,విడం సాయి కిషోర్ నేత,సింగం కృష్ణ,సురపల్లి జోహార్,దువ్వ నవీన్,తదితరులు,పాల్గొన్నారు.



# మాద్రి పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో.. కాలుష్యంపై పరుగులు






(మొదటి పేజీ తరువాయి)

ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. యువత, మహిళలు, విద్యార్థులు, చిన్నారులు, సీనియర్ సిటిజన్లు, ప్రభుత్వ ఉద్యోగులు, పరిశ్రమల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ పారిశ్రామిక ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రతినిధులు పాల్గొనడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. “రన్ ఫర్ నేచర్” అనే సందేశంతో సాగిన 3కె రన్‌లో పాల్గొన్న వారు పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ప్లకార్డులు, నినాదాలతో ప్రజల్లో చైతన్యం కల్పించారు. పచ్చదనం పెంచుదాం.. కాలుష్యాన్ని తగ్గిద్దాం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిద్దాం, పరిశుభ్రమైన పటాన్‌చెరు కోసం ప్రతి ఒక్కరం భాగస్వాములం అవుదాం అంటూ పలు నినాదాలతో ఈ కార్యక్రమం అట్టహాసంగా సాగింది. పర్యావరణ పరిరక్షణతో పాటు ఆరోగ్యం, వ్యాయామం, పరిశుభ్రత, పచ్చదనం వంటి అంశాలపై కూడా ప్రజల్లో అవగాహన కలిగేలా కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ సందర్భంగా ఎండిఆర్ ఫౌండేషన్ అధినేత మాద్రి పృథ్వీరాజ్ మాట్లాడుతూ.. పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందిన పటాన్‌చెరులో ఆర్థిక అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. అభివృద్ధి ఒక్కటే లక్ష్యం కాదు, ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించడమే అసలైన అభివృద్ధని అన్నారు. పటాన్‌చెరు పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందాలి, అదే సమయంలో పచ్చదనం, పరిశుభ్రత, స్వచ్ఛమైన గాలి ఉండే ప్రాంతంగా కూడ నిలవాలని పృథ్వీరాజ్ ఆకాంక్షించారు. కాలుష్య నియంత్రణ అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత కాదని, ప్రజలు కూడా తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని ఆయన సూచించారు. పారిశ్రామిక, వాహన కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రభుత్వ చర్యలతో పాటు ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రతి పౌరుడు పర్యావరణ పరిరక్షణను తన వ్యక్తిగత బాధ్యతగా భావించాలని సూచించారు. ఒక మొక్క నాటడం, దాన్ని సంరక్షించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వంటి చిన్న చిన్న చర్యలే భవిష్యత్ తరాలకు పెద్ద మార్పును తీసుకువస్తాయని ఆయన పేర్కొన్నారు. కాలుష్యరహిత పటాన్‌చెరు అనేది ఒక్కరి లక్ష్యం కాదు, మనందరి సమిష్టి సంకల్పం అని గుర్తు చేశారు. ఈ సంకల్పాన్ని ప్రజల భాగస్వామ్యంతో నిరంతర ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలని మాద్రి పృథ్వీరాజ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారికి ధ్రువపత్రాలను అందజేయడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా మొక్కలను పంపిణీ చేశారు. మొక్కలు నాటడం ప్రారంభం మాత్రమే, దాన్ని పెంచి సంరక్షించడమే అసలైన బాధ్యత అనే సందేశంతో ప్రతి ఒక్కరు తమ పరిసరాల్లో మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని నిర్వాహకులు సూచించారు. 3కె రన్ ద్వారా ఒకవైపు ఆరోగ్యంపై అవగాహన పెంచుతూ, మరోవైపు పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో బాధ్యతను పెంపొందించడం, ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా నిలిచింది. పటాన్‌చెరు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఉత్సాహంగా రన్‌లో పాల్గొనడంతో కార్యక్రమ ప్రాంగణం సందడిగా మారింది. యువత పెద్ద సంఖ్యలో పాల్గొనడం, మహిళలు, విద్యార్థులు ఉత్సాహంగా రన్‌లో పాల్గొనడం పర్యావరణ సందేశం పట్ల ప్రజల్లో పెరుగుతున్న ఆసక్తికి నిదర్శనంగా నిలిచింది. ఆరోగ్యం, పర్యావరణం రెండింటినీ కలిపి నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రజల్లో సానుకూల స్పందనను తీసుకువచ్చింది. ఈ కార్యక్రమానికి మెడికల్ పార్ట్‌నర్‌గా సహకరించి, 3కె రన్‌లో పాల్గొన్న వారి ఆరోగ్య భద్రతకు అవసరమైన వైద్య సహాయాన్ని అందించిన అమెదా హాస్పిటల్స్ యాజమాన్యానికి, వైద్యులు, సిబ్బందికి మాద్రి పృథ్వీరాజ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో అమెదా హాస్పిటల్స్ అందించిన సహకారం ఎంతో అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. 3కె రన్‌ను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి మాద్రి పృథ్వీరాజ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రోత్సహించిన ప్రజాప్రతినిధులకు, సహకరించిన అధికారులు, పోలీసు శాఖకు, పరిశ్రమల ప్రతినిధులకు, స్వచ్ఛంద సంస్థలకు, వాలంటీర్లకు, నిర్వాహక బృందానికి, ముఖ్యంగా పెద్ద సంఖ్యలో పాల్గొన్న యువత, మహిళలు, విద్యార్థులు, చిన్నారులు, సీనియర్ సిటిజన్లకు, పటాన్‌చెరు ప్రజలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు పృథ్వీరాజ్. అందరి సహకారం, ప్రోత్సాహం వల్లే ‘రన్ ఫర్ నేచర్’ కార్యక్రమం ఇంతటి విజయాన్ని సాధించిందని అన్నారు. ఇది కేవలం ఒక 3కె రన్ కాదు, పర్యావరణ పరిరక్షణపై మనందరం కలిసికట్టుగా తీసుకున్న బాధ్యతకు ప్రతీక అని ఆయన అన్నారు. పొల్యూషన్ ఫ్రీ పటాన్‌చెరు లక్ష్యాన్ని ఒక్క కార్యక్రమానికే పరిమితం చేయకుండా నిరంతర ప్రజా ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లేందుకు ఎండిఆర్ ఫౌండేషన్ కృషి చేస్తుందని తెలిపారు. పచ్చదనం పెంపు, పరిశుభ్రత, ప్లాస్టిక్ నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యంపై మరిన్ని అవగాహన కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యంతో నిర్వహిస్తాం అని పృథ్వీరాజ్ తెలిపారు. మన పటాన్‌చెరు, మన బాధ్యత, మన భవిష్యత్ అని అన్నారు. రాబోయే తరాలకు స్వచ్ఛమైన, పచ్చని, ఆరోగ్యకరమైన పటాన్‌చెరును అందించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి అని ఆయన పిలుపునిచ్చారు.



# హెల్మెట్ ఉన్నా ఫొటో ఎందుకు తీశారు?

ప్రశ్నించిన విలేకరితో ఏఎస్సై రాములు దురుసు ప్రవర్తన

విచారణకు జర్నలిస్టుల డిమాండ్

**చిలిప్‌చెడ్, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 06:** హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న తన ఫొటో ఎందుకు తీశారని ప్రశ్నించిన ఓ విలేకరితో చిలిప్‌చెడ్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఏఎస్సై రాములు దురుసుగా, అసభ్యకరమైన భాషలో మాట్లాడినట్లు ఆరోపణలు రావడం వివాదాస్పదంగా మారింది. విలేకరి తెలిపిన వివరాల ప్రకారం.. పని నిమిత్తం జోగిపేట నుంచి హత్నూర వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన ఓ కానిస్టేబుల్ తన ఫొటో తీసినట్లు తెలిపారు. తాను హెల్మెట్ ధరించి ఉన్నప్పటికీ ఫొటో ఎందుకు తీశారని కానిస్టేబుల్‌ను ప్రశ్నించగా, ఫైన్ పడిన అనంతరం పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫొటో డిలీట్ చేసుకోవాలని చెప్పినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న ఏఎస్సై రాములు జోక్యం చేసుకుని తనతో దురుసుగా మాట్లాడారని విలేకరి ఆరోపించారు. "ఎందుకు అడుగుతున్నావు.. నువ్వెవరు.. విలేకరి అయితే ఏంటి?" అంటూ మాట్లాడటంతో పాటు అసభ్యకరమైన పదజాలంతో దూషించి, "ఏం చేసుకుంటావో చేసుకో" అంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారని తెలిపారు. ఈ విషయంపై సంబంధిత ఎస్సైకి ఫోన్ చేసి ఫిర్యాదు చేసినప్పటికీ, డ్యూటీలో ఉన్న సిబ్బందిని సమర్థించే విధంగా స్పందించారని విలేకరి ఆరోపించారు. విధి నిర్వహణలో భాగంగా ప్రశ్నించిన విలేకరితో పోలీసు సిబ్బంది




గౌరవంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పలువురు జర్నలిస్టులు పేర్కొన్నారు.

**విచారణ జరిపి వాస్తవాలు వెలుగులోకి తేవాలి:**

విలేకరితో ఏఎస్సై రాములు దురుసుగా ప్రవర్తించినట్లు వచ్చిన ఆరోపణలపై ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని జర్నలిస్టులు కోరుతున్నారు. ఘటనకు సంబంధించిన వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చి, ఆరోపణలు నిజమని తేలితే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## కేఎల్ఐ కాల్వ వద్ద వృద్ధురాలి అదృశ్యం

చెప్పులు, చేతికర్ర లభ్యం.. కాల్వలో దూకి ఉంటుందేమోనని కుటుంబ సభ్యుల అనుమానం



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** కల్వకుర్తి పుర పరిధిలోని సిలార్పల్లి గ్రామానికి చెందిన 70 ఏళ్ల వృద్ధురాలు అంజనమ్మ ఆదివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమైన ఘటన కలకలం రేపింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తాంద్ర పర్వతాలు తల్లి అంజనమ్మ ఆదివారం ఉదయం సుమారు 8 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లింది. కొంతసేపటి తర్వాత కూడా ఆమె తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో విస్తృతంగా గాలించారు. అయినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదు..ఈ క్రమంలో కుటుంబ సభ్యులు కల్వకుర్తి వైపు వస్తుండగా, ఉదయం సుమారు 11 గంటల సమయంలో అంజనమ్మ మనవరాలు రాధిక కేఎల్ఐ కాల్వ సమీపంలో వృద్ధురాలు కనిపించినట్లు సమాచారం అందించింది. సుమారు అరగంట క్రితం అంజనమ్మ కేఎల్ఐ కాల్వ వద్ద నిలబడి ఉన్నట్లు రాధిక తెలిపినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. దీంతో వెంటనే కుటుంబ సభ్యులు కేఎల్ఐ కాల్వ వద్దకు వెళ్లి చూడగా, అక్కడ అంజనమ్మకు చెందిన చెప్పులు, చేతికర్ర కనిపించాయి. పరిసర ప్రాంతాల్లో ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో అంజనమ్మ మనస్తాపానికి గురై కేఎల్ఐ కాల్వలో దూకి ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై తాంద్ర పర్వతాలు పోలీసులకు ఫిర్యాదు చేసి, తన తల్లి అంజనమ్మ ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కురుమూర్తి తెలిపారు.

## ఘనంగా కోతులపురం గ్రామంలో బోనాల పండుగ ఉత్సవాలు

**క్రైమ్ మిర్రర్,సశీస్థాన్ నారాయణపురం:** యాదాద్రి భువనగిరి జిల్లా సశీస్థాన్ నారాయణపురం మండలం కోతులపురం గ్రామపంచాయతీ పరిధిలో శ్రీ ముత్యాలమ్మ తల్లి దేవాలయంలో బోనాల పండుగ ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీ ముత్యాలమ్మ తల్లి దేవాలయ బోనాల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలోని మహిళలు భక్తిశ్రద్ధలతో ఇంటింటి బోనాలు ఎత్తుకొని అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. కోతులపురం గ్రామం మొత్తం ఆధ్యాత్మిక వాతావరణంతో మార్మోగింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, బోనాలను సమర్పించారు. గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని శ్రీ ముత్యాలమ్మ తల్లి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా బోనాల ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, గ్రామ ప్రజలందరి సహకారంతో ప్రతి సంవత్సరం బోనాల పండుగను సంప్రదాయబద్ధంగా, ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. మొత్తంగా కొతులాపురం గ్రామంలో శ్రీ ముత్యాలమ్మ తల్లి బోనాల పండుగ భక్తిశ్రద్ధల మధ్య అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కోతులపురం గ్రామ సర్పంచ్ కురుమిద్ద వినోద శ్రీనివాస్, శ్రీ ముత్యాలమ్మ దేవాలయ బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రామ ఉపసర్పంచ్ పొట్ట నరసింహ, దేవాలయ బోనాల ఉత్సవ



కమిటీ గౌరవ అధ్యక్షులు పొట్ట శంకరయ్య, ఉపాధ్యక్షులు ఇరగదిండ్ల యాదయ్య, కొత్త ఐలయ్య, పొట్ట లింగస్వామి, కార్యదర్శి పొట్ట లింగస్వామి, సహాయ కార్యదర్శి వరికుప్పల నరసింహ, చిరగోని రమేష్, కోశాధికారి చిరగోని మహేష్, కార్యవర్గ సభ్యులు పొట్ట రమేష్, ఇరగదిండ్ల నరసింహ, కమిటీ సభ్యులు బొంగు సత్తయ్య, ఇరగదిండ్ల ఇద్దయ్య, కొత్త చంద్రయ్య, పాలకుర్ల రమేష్, బొమ్మ కంటి మహేష్, ఏనుగు పరశురాం, ఈదులకంటి జంగయ్య, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

# మైనర్ బాలికపై హత్యాచారం కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్

రిమాండ్‌కు తరలింపు

వివరాలు వెల్లడించిన హుజూర్నగర్ సీఐ

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు.. సీఐ చరమంద రాజు

**క్రైమ్ మిర్రర్,హుజూర్ నగర్ :** హుజూర్ నగర్ మండల పరిధిలోని ఒక గ్రామంలో మైనర్ బాలికపై జరిగిన హత్యాచారం ఘటనకు సంబంధించి ఇద్దరు నిందితులు 19 సంవత్సరాల యువకులు కాంపాటి విరామ్, పాముల ఆకాష్ లను అరెస్ట్ చేసి,రిమాండ్‌కు తరలించినట్లు హుజూర్నగర్ సీఐ చరమందరాజు తెలిపారు.సీఐ తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని ఒక గ్రామానికి చెందిన మైనర్ బాలికపై జరిగిన హత్యాచారం ఘటనపై హుజూర్నగర్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయడం జరిగింది.ఈ అమానుష ఘటనపై పోలీసులు అత్యంత వేగంగా స్పందించి దర్యాప్తు చేపట్టారు. సమగ్ర విచారణ అనంతరం నిందితులు ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నాము అన్నారు. వారిని అరెస్ట్ చేసిన అనంతరం న్యాయస్థానం ముందు హాజరుపరిచి,రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.మహిళలు, మైనర్ బాలికల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, ఇటువంటి అసాంఘిక పనులకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.



# జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా కొప్పు లక్ష్మీనారాయణ గౌడ్

**బాధ్యత అప్పగించిన జిల్లా అధ్యక్షురాలు చల్ల శ్రీలత రెడ్డి**

**పదవి నా బాధ్యతను మరింత పెంచింది - కలిసికట్టుగా పని చేద్దాం**

**ఓబీసీ మోర్చాను మరింత బలోపేతం చేయడంలో కృషి చేస్తాను**

**కొప్పు లక్ష్మీనారాయణ గౌడ్**



**క్రైమ్ మిర్రర్ , నేరేడుచర్ల :** భారతీయ జనతా పార్టీ జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా కొప్పు లక్ష్మీనారాయణ గౌడ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా నాపై నమ్మకం ఉంచి కీలకమైన బాధ్యతను అప్పగించిన బీజేపీ సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలు చల్ల శ్రీలతరెడ్డి కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకుంటూ, వారిని శాలువాతో సన్మానించారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ఓబీసీ మోర్చాను మరింత బలోపేతం చేయడంతో పాటు పార్టీ సిద్ధాంతాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో జిల్లా కోశాధికారి తాళ్ల నరేందర్ రెడ్డి, నేరేడుచర్ల పట్టణ అధ్యక్షులు కొనతం నాగిరెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి ఏమిరెడ్డి శంకర్ రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి చిత్తలూరి సోమయ్య, జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు ఆకుల జగతయ్య బిజెపి నాయకులు బైరెడ్డి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వలస కార్మికురాలి ప్రాణం ఖరీదు ఎంత?

**సువర్ణ దుర్గ పేపర్ మిల్లులో ప్రమాదం.. మహిళా కార్మికురాలి మృతి**

**న్యాయం, పరిహారం కోరుతూ పరిశ్రమ ఎదుట బంధువులు, కార్మికుల ఆందోళన**



**హత్నూర, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 05:** బతుకుదెరువు కోసం జార్ఖండ్ నుంచి వలసవచ్చి హత్నూరలోని సువర్ణ దుర్గ పేపర్ మిల్లులో పనిచేస్తున్న ఓ మహిళా కార్మికురాలు విధి నిర్వహణలో ప్రమాదానికి గురై మృతి చెందారు. మృతురాలిని జార్ఖండ్ రాష్ట్రం గూఢ జిల్లా, పత్రగాయి గ్రామానికి చెందిన సిమోథీ మారండి (48)గా గుర్తించారు. ఈ ఘటనతో పరిశ్రమలో పనిచేస్తున్న వలస కార్మికుల్లో ఆందోళన నెలకొంది. సిమోథీ మారండి కొంతకాలంగా బతుకుదెరువు కోసం జార్ఖండ్ నుంచి హత్నూరకు వలసవచ్చి, పరిశ్రమ ప్రాంగణంలోనే నివాసముంటూ కార్మికురాలిగా పనిచేస్తున్నట్లు సమాచారం. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. రోజువారీ విధుల్లో భాగంగా పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు తీవ్రంగా గాయపడినట్లు తెలిసింది. పరిశ్రమ యాజమాన్యం గుట్టుసప్పుడు కాకుండా వెంటనే ఆమెను సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినప్పటికీ, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

### మృతదేహంతో మిగిలిన కుటుంబం.. న్యాయం కోసం ఆందోళన

సహచర కార్మికురాలి మృతితో ఆగ్రహించిన తోటి కార్మికులు, జార్ఖండ్‌కు చెందిన వలస కార్మికులు పరిశ్రమ ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగారు. మృతురాలి కుటుంబానికి తక్షణ న్యాయం చేయాలని, తగిన నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై, తహసీల్దార్ ఘటనాస్థలానికి చేరుకుని ఆందోళనకారులు, మృతురాలి బంధువులతో చర్చలు జరిపారు. బాధిత కుటుంబానికి కంపెనీ యాజమాన్యం నుంచి నష్టపరిహారం అందేలా చూస్తామని, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

### కార్మికుల ప్రాణాలకు భద్రత ఎక్కడ?

ఈ ప్రమాదం నేపథ్యంలో పరిశ్రమల్లో కార్మికుల భద్రతపై తీవ్ర ప్రశ్నలు తలెత్తుతున్నాయి. 'కార్మికుడి ప్రాణం కంటే పరిశ్రమ ఉత్పత్తే ముఖ్యమా?, వలస కార్మికుల భద్రతకు బాధ్యత ఎవరిది? అంటూ కార్మికులు, స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పరిశ్రమల్లో రక్షణ నిబంధనలు కాగితాలకే పరిమితమవుతున్నాయా?, కార్మికులకు అవసరమైన భద్రతా పరికరాలు, శిక్షణ, రక్షణ చర్యలు పూర్తిస్థాయిలో అందుతున్నాయా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఒక ప్రాణం పోయిన తర్వాత పరిహారం ఇవ్వడం కంటే.. ప్రమాదం జరగకుండా చూడడం ముఖ్యం కాదా? అని పలువురు నిలదీస్తున్నారు. ముఖ్యంగా ఇతర రాష్ట్రాల నుంచి వలసవచ్చి పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల భద్రతపై యాజమాన్యాలు, సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

### సంగారెడ్డి జిల్లాలో వరుస ప్రమాదాలపై ఆందోళన

సంగారెడ్డి జిల్లాలో పారిశ్రామిక ప్రమాదాలు చోటుచేసుకున్న ప్రతిసారీ కార్మికుల భద్రతపై చర్చ జరుగుతున్నప్పటికీ, ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు ఎంతవరకు ఫలిస్తున్నాయన్నది ప్రశ్నార్థకంగా మారిందని కార్మిక సంఘాల ప్రతినిధులు పేర్కొంటున్నారు. "సంగారెడ్డి జిల్లాలో కార్మికుల వరుస ప్రమాదాలకు అడ్డుకట్ట ఎప్పుడు? అని వారు ప్రశ్నిస్తున్నారు. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాల అమలుపై సంబంధిత శాఖలు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహిస్తున్నాయా? కార్మికులకు రక్షణ పరికరాలు అందుతున్నాయా? అత్యవసర పరిస్థితుల్లో వైద్య సహాయం అందించే ఏర్పాట్లు ఉన్నాయా? వంటి అంశాలపై సమగ్ర పరిశీలన జరగాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

### కేసు నమోదు.. దర్యాప్తు

ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, పరిశ్రమలో భద్రతా ప్రమాణాల అమలు, కార్మికులకు కల్పిస్తున్న రక్షణ చర్యలపై అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టాలని కార్మికులు కోరుతున్నారు. మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం, పరిశ్రమ యాజమాన్యం అండగా నిలిచి తగిన పరిహారం అందించాలని, భవిష్యత్‌లో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను కఠినంగా అమలు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# ఏఐవైఎఫ్ రాష్ట్ర మూడో మహాసభల జయప్రదం చేయండి

**ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు కొండూరి వెంకటేష్**




**క్రైమ్ మిర్రర్,సంస్థాన్ నారాయణపురం:** సెప్టెంబర్ 8,9,10 తేదీలలో యాదగిరిగుట్టలో జరిగే ఏఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర నాయకులు కొండూరి వెంకటేష్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం జనగాం గ్రామంలో ఆదివారం మహాసభల వాల్ పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెప్టెంబర్ 8వ తేదీన యాదగిరిగుట్ట పట్టణంలో భారీఎత్తున యువజన కవాతు నిర్వహిస్తున్నట్లు 9 10 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుండి వచ్చిన ప్రతినిధులతో మహాసభలు ఉంటాయని, ఈ మహాసభ లకు యువకులు అధిక సంఖ్యలో పాల్గొని పాలకులు అవలంబించే విద్యార్థి యువజన విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని వారు అన్నారు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో యువత ప్రధాన పాత్ర పోషిస్తుందని, దేశంలో ప్రజాస్వామ్య లౌకిక విలువల పరిరక్షణ కోసం ఏఐవైఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని. యువత చెడు వ్యసనాలకు చెడు మార్గాలకు దూరంగా ఉంటూ సమాజానికి తమ వంతు సేవ చేయాలని, దోపిడీ అవినీతి రహిత సమాజ నిర్మాణం కోసం కృషి చేయాలని ఆయన అన్నారు. సమగ్ర యువజన విధానం అమలు కోసం, విద్య వైద్య ఉపాధి హక్కుల సాధనకై ఏఐవైఎఫ్ నిరంతర పోరాటాలు నిర్వహిస్తుందని, ఇదే తరుణంలో యాదగిరిగుట్టలో జరిగే రాష్ట్ర మూడో మహాసభలు భవిష్యత్తు యువజన ఉద్యమాలకు దిక్సూచిగా నిలబడాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైయఫ్ మండల కార్యదర్శి కొండూరి రవితేజ, సిపిఐ శాఖ కార్యదర్శి బైకని రాజు, కొండూరి స్వామి వరికుప్పల రాకేష్, కొండూరి గణేష్, కప్పల అరుణ్, ఐతరాజ శ్రీను, కొండూరి రాజు,కొండూరి అఖిల్,కె . శ్రవణ్ కె . మల్లికార్జున్,తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణ బృందావన్ కాలనీ ఎన్నికల్లో ప్రవీణ్‌రెడ్డి ప్యానెల్ జోరు

**53 ఓట్ల మెజారిటీతో ఘన విజయం.. అధ్యక్షుడిగా ప్రవీణ్‌రెడ్డి**



**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 06:** అమీన్‌పూర్ డివిజన్ పరిధిలోని కృష్ణ బృందావన్ కాలనీ అసోసియేషన్ ఎన్నికల్లో ప్రవీణ్‌రెడ్డి ప్యానెల్ ఘన విజయం సాధించింది. మొత్తం 307 ఓట్లు పోలవగా, ప్రవీణ్‌రెడ్డి ప్యానెల్‌కు 180 ఓట్లు లభించాయి. దీంతో ప్రత్యర్థి ప్యానెల్‌పై 53 ఓట్ల మెజారిటీతో విజయం సాధించింది. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా ప్రవీణ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఉదయ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా శరత్, కోశాధికారిగా త్రినాథ్‌బాబు, జాయింట్ సెక్రటరీగా యోగేందర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రేవంత్ ఎన్నికయ్యారు. విజయం అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను కాలనీ వాసులు అభినందించారు. కాలనీ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు. కాలనీ వాసుల సహకారంతో సమష్టిగా పనిచేసి కృష్ణ బృందావన్ కాలనీని మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.